క్లుప్తంగా

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించారు. ఈ ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి కార్తీక మాసంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి సత్యదేవుని వ్రతాలు నిర్వహిస్తారు. ఈ మేరకు భక్తులకు ఆలయ గుమస్తా గోపి తగిన ఏర్పాట్లు సదుపాయాలను కల్పించారు.

నేడు ఆలయంలో కార్తీక త్రి సహస్ర దీపాలంకరణ

కొయ్యలగూడెం: కార్తీకమాస మంగళవారం సందర్భంగా టెంపుల్స్ సెంటర్‌లో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో త్రి సహస్ర కార్తీక దీపాలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు. ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం ఐదు గంటలకు స్వామి వారికి పంచామృత అభిషకాల నిర్వహణ, ఆరు గంటలకు భగవద్గీత పారాయణం ప్రారంభిస్తామన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ఎక్సైజ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా యర్రగుంటపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చెన్ను సీతారావురాజును అదుపులోకి తీసుకుని అతని వద్ద తెలంగాణకు మద్యం 5 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అనంతరం పట్టుబడ్డ వ్యక్తిని తహసీల్దార్ వద్ద ప్రవేశపెట్టి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఆర్‌వీఎల్ నరశింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన



కల్వర్టును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జంగారెడ్డిగూడెం: ప్రజలకు మెరుగైన సేవలు అలందించేందుకు పాలకవర్గం ఎప్పుడూ ముందుంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం సంత మార్కెట్‌కు వెళ్లే మార్గమధ్యంలో కల్వరుట్ పాడవడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పరిశీలించారు. వీలైనంత త్వరగా ఈ కల్వర్టును నిర్మించాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ చిటికెల అచ్చిరాజు, కమిషనర్ కేవీ రమణ, బత్తిన చిన్న, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడి ఆలయంలో భక్తుల రద్దీ



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో రెండో కార్తీక సోమవారాన్ని పురష్కరించుకుని శివదేవుడికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్ల వద్ద మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలోని శివలింగానికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుడు శేష వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బాసినేని సత్యనారాయణ, కట్టం వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. కార్తీక వన భోజనం

- పూర్వీకుల నుంచి ఆచరిస్తున్న జనం
- కుల మతాలకు అతీతంగా కార్తీక వన భోజనాలు



కార్తీక వనసమారాధనలో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



కార్తీక వనసమారాధన సూచించే చిత్రం

జంగారెడ్డిగూడెం: ఆద్యంతం ఆధ్యాత్మికం కార్తీక వనసమారాధన. కార్తీకమాసం నాటికి వానలు ముగిసి, వెన్నెల రాత్రులు ప్రారంభమవుతాయి. చలి అంతగా ముదరని సమశీతోష్ణ వాతావరణంతో మనసుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. కావున ఈ కార్తీకమాసంలోనే వన సందర్శనకు ఆమోదయోగ్యంగా పూర్వీకులు నిర్ణయించారు. ఆధ్యాత్మికపరంగా, శివ కేశవులకు ప్రీతికరమైనది ఈ కార్తీకమాసం. అందుచేత శివ, కేశవ భక్తులు ఒకచోట చేరి, ఐకమత్యంతో ఆనందంగా గడపడానికి అవకాశం కల్పించే మాసం. ఈ కార్తీకమాసం. వృక్షాలు, మొక్కలు, చెట్లు పచ్చగా చిగిర్చి, పరిశుద్ధమైన, ఆరోగ్యకరమైన ప్రాణ వాయువును ప్రకృతిలో విహరింపజేసే మాసం ఈ కార్తీకమాసం.

వనభోజనం అంటే

కేవలం తిని, తిరగడమే కాదు. దానికో పద్ధతి, నియమం ఉంది. కాలకృత్యాలు, స్నానాలు పూర్తి చేసుకున్న తర్వాత బంధు మిత్రులు, పరిచయస్తులు, ఇరుగు, పొరుగు కలిసి, జాతి, మత, కుల వివక్షత లేకుండా, వీలయితే ఒకే వాహనంలో గానీ, లేదా రెండు వాహనాలలో గానీ వారు ఎంచుకున్న వనానికి సూర్యోదయానికి పూర్వమే చేరుకోవాలి. ముందుగా ఓ వట వృక్షం క్రింద ఇష్టదేవతా విగ్రహాలను ఉంచి పూలదండలతో చక్కగా అలంకరించాలి. ఆనందం పంచుకోవాలంటే వంట వాళ్లను తీసుకెళ్లకూడదు మగవారు పాటలు పాడుతూ కూరలు తరుగుతూంటే, ఆడవారు తలో రకం వంట వండుతూంటే ఆ ఆనందమే వేరు. పిల్లలంతా కలిసి చేసే అల్లరిలోని మజాయే వేరు. అనుభవంతో తలపండిన పెద్దల ఛలోక్తుల చురకల వేడే వేరు. అన్ని రకాల సాంప్రదాయాలకూ, సంస్కృతులకూ సమాన వేదిక ఇది. సామూహికంగా కలిసి చేసిన శాకాహార వంట పూర్తయిన తర్వాత, ఆ వండిన పదార్థాలను పూజా స్థలానికి చేర్చి అందరూ కలిసి దేవతారాధన చేసి, నివేదన సమర్పించి, ఆ ప్రసాదాన్ని అందరూ కొసరి కొసరి వడ్డించుకుంటూ తింటూంటే, ×ఇంత రుచి ఉందా!₹ అని అనిపించక మానదు.

జిల్లాలో:

జిల్లా వ్యాప్తంగా కార్తీక వన సమారాధనల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటారు. గ్రామాలు, పట్టణాలకు సమీపంలో ఉన్న తోటలు, వనాల్లో సమారాధనలు నిర్వహిస్తారు. జిల్లాలోని జీలకర్రగూడెం బౌద్ధారామాలు, గుబ్బల మంగమ్మ గుడి, పేరుపాలెం బీచ్ తదతర ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా వన సమారాధనలు నిర్వహించుకుంటారు. గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తుండగా, ఆధ్యాత్మికంగా స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు, పక్కనే ఉన్న కేకేఎం ఎర్రకాలువ జలాశయం సందర్శించుకుంటూ పరిమిత సంఖ్యలో ప్రజలు సమారాధనలు చేసుకుంటారు. ఇక గోదావరి నది మధ్యలో ఉన్న పట్టిసీమ క్షేత్రానికి సైతం కార్తీక మాసం సందర్భంగా సందర్శించకుని, ఇసుక తిన్నెలపై సమారాధన నిర్వహించుకుంటారు.

ఆధ్యాత్మిక ప్రదేశాల్లో నిర్వహించాలి



నరనారాయణులు సంచరించే ప్రదేశాలుగా వనాలు పేర్కొంటారు. వన సమారాధన ఇటు ఆధ్యాత్మికానికి, ఆటు అరోగ్యానికి వేదికగా నిలుస్తాయి. పురాణాల ప్రకారం వన భోజనాలు అమలకవృక్షం, శమీవృక్షం, మర్రి వృక్షం, మారేడు వృక్షం, ఫలవృక్షాలు, తులసీ వృక్షాలు ఉన్న చోట లేదా, పశుపక్ష్యాదులు తిరుగాడే పచ్చని ప్రదేశాల్లో నిర్వహించాలి. దీని వల్ల స్వచ్ఛమైన ప్రాణవాయివు శరీరానికి అందడంతో పాటు, ఆయా ప్రాంతాల్లో లభించే తినే పదార్థాలు పోషకాలు, ఔషద గుణాలు కలిగి ఉండటంతో ఆరోగ్యాన్ని అందిస్తాయి.

– గరిమెళ్ల గంగాధర శాస్త్రి, పురోహితుడు, జంగారెడ్డిగూడెం

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం: మండలంలోని బూసరాజుపల్లి, కొత్త సింగన్నపల్లి కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం మండల సర్పంచుల చాంబర్ మాజీ అధ్యక్షుడు కుంజా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ టీఏసీని ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సర్పంచులు తెల్లం రాముడు, మాల్చి వెంకన్నబాబు, బొజ్జి దొర, తెల్లం వెంకాయమ్మ, కుంజా దుర్గమ్మ పాల్గొన్నారు.

హరహర మహాదేవ



జంగారెడ్డిగూడెం: శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆలయాలు శివ నామస్మరణతో మారుమ్రోగాయి. కార్తీక మాసం రెండో సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తి, హరహర మహాదేవ శంభోశంకర అంటూ పూజలు చేశారు. పట్టణంలోని ప్రధాన శివాలయాలైన బైనేరు ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, పేరంపేట శ్రీరాజరాజేశ్వరస్వామి, జెడ్పీ హైస్కూల్ వద్ద గల శివాలయంలో, గుహాలయలోని ఓంకారేశ్వరస్వామితో పాటు, పట్టణంలోని నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయదుర్గమ్మ, లలితాదేవి ఆలయాల్లోని శివలింగాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ముక్కంటికి పంచామృతాభిషేకాలు నిర్వహించుకున్నారు.

పోలవరం రూరల్: కార్తీక మాసం సోమవారం పర్వదినం కావడంతో పోలవరం మండలంలోని పట్టిసం శివక్షేత్రం శివనామస్మరణతో మారుమ్రోగింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శివక్షేత్రానికి చేరుకుని శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన భక్తులకు దేవస్థానం అధికారులు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. శివకేశవులకు నిలయమైన ఈ క్షేత్రంలో క్షేత్రపాలకుడైన భావన నారాయణ స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



కొయ్యలగూడెం: అబుల్ కలాం జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్వాతంత్ర సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కుంతలగూడెం ఎంపీ యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం రాయపూ డి వెంకటరమణ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించి అబుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్,చరిత్ర విభాగముల సంయుక్త అధ్వర్యంలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు అధ్యక్షతన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీ వంకబొత్తప్పగూడెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో బాధితులకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆర్థిక సాయం అందజేశారు. బాధితులైన మూడు కుటుంబాల వారికి 50 కేజీల బియ్యం, రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు గొడ్డటి నాగేశ్వరరావు, మందపాటి రామకృష్ణ, మండల కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే బాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నూనె నాగు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం మానవత శాఖ ద్వారా రూ.9వేలు ప్రమాద బాధితులైన వంక సత్యనారాయణ, వంక రంగారావు, కుంజా రామలక్ష్మిలకు అందజేశారు. అధ్యక్షుడు మాటూరు సుధీర్, గెడ సుబ్బారావు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, బొమ్మ మోహనరావు, తిగిరిపల్లి చంటి పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం తక్షణం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతలపూడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల అకౌంట్‌లో వేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సోమశేఖరాచార్యులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల జిల్లా ప్రధాన కార్యదర్శి దొంత కష్ణ, చింతలపూడి రైతు సంఘం అధ్యక్షులు షేక్ కాలేషా, రైతు సంఘ మండల కమిటీ నాయకులు సీపీఐ చింతలపూడి మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

నిర్వాసితులను పట్టించుకోని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

వేలేరుపాడు: పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగటం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్ అన్నారు. మండలంలోని బండ్లబోరు గ్రామంలో తాటి దుర్గారావు అధ్యక్షతన ఆ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం మొత్తాన్ని పోలవరం ముంపులోకి తీసుకోవాలన్నారు. లేకుంటే వరద ప్రభావం ఎలా ఉంటుందో గత అనుభవాలు తెలిపాయన్నారు. నిర్వాసితుల సమస్యలు పదేపదే చెబుతున్నా పట్టించుకోకపోవడం సరైన చర్య కాదన్నారు. 2017లో చేసిన సర్వేని ఆధారంగా చేసుకుని ప్యాకేజీలు ఇస్తే యువత ఎంతో నష్టపోతారన్నారు. అర్హులైన వందల కుటుంబాలను అనర్హులుగా పేర్కొని వారికి తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విలీన మండలాలు మహాసదస్సు:

ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఏడు మండలాల పోలవరం నిర్వాసితులతో డిసెంబర్ 10న ఎటపాకలో మహా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఎన్ని పోరాటాలు చేయటానికైనా భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. నిర్వాసితులకు అండగా భవిష్యత్తులో చేయవలసిన పనులపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ నెల 18న సీపీఐ మండల జనరల్ బాడీ సమావేశం ఉదయనగర్‌లో నిర్వహిస్తామని అక్కడే పలు నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: 15వ ఆర్థిక సంఘం నిధులతో సుబ్బంపేట రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీ రమణ, కౌన్సిలర్లతో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చాలా కాలం నుంచి సుబ్బంపేట రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రోడ్డు మార్గంలో ఆలయాలు కూడా ఉన్నాయని, ఆలయాలకు వెళ్లే భక్తులు సైతం గోతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో సుబ్బంపేట రోడ్డును రూ.70 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించేందుకు కౌన్సిల్ సమావేశంలో సభ్యుల సహకారంతో తీర్మానించామన్నారు. అదేవిధంగా పట్టణంలో పలు అభివద్ధి కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా రూ.1 కోటితో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు, కౌన్సిలర్ చిటికెల అచ్చిరాజు పాల్గొన్నారు.

వయోజన విద్య శిక్షణా కార్యక్రమం

పోలవరం రూరల్: మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో కె.శ్రీనివాస్ అన్నారు. పోలవరంలోని మండల సమాఖ్య కార్యాలయంలో వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ అక్షరాస్యత మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన ప్రతీ అంశాన్ని నిరక్షరాస్యులకు తెలియజేయాలన్నారు.

మెనూ చార్జీలు పెంచాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూ అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ మెనూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ చార్జీలు కనీసం ఒక్కొక్క విద్యార్థికి రూ.20 పెంచి అమలు చేయాలన్నారు. సీహెచ్ విజయకాంతం, పులపాకుల ప్రియాంక, ఎండీ ఆశ, కె.కుమారి, శివంగుల సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ధర్నా

బుట్టాయగూడెం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన పథక కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు.

డ్వాక్రా మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ

బుట్టాయగూడెం: తరచూ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించే స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరమని వయోజన విద్య ఏలూరు జిల్లా నోడల్ ఆఫీసర్ కెవి. సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జ్యోతి, ఏపీఎం పద్మావతి, ఎమ్ఆర్‌సీ బాబురావు, సీసీలు, వలంటీర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో: మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఉల్లాస్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏపీఎం ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

జంగారెడ్డిగూడెం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్‌ల సమావేశం సోమవారం ధర్మన్న స్మారక భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా పునరుద్ధరణ చేయలేదని రమణ అన్నారు.

బోధనేతర పనులు నిలిపివేయాలి

కామవరపుకోట: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నిలిపివేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలో పీఆర్‌టీయూ సభ్యత నమోదు తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, యానాదుల కాలనీ, పాతూరు, వీరభద్ర కాలనీలోని పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనులు, యాప్‌ల భారం వంటి బోధనేతర పనులు నిలిపేయాలని, ప్రభుత్వం ఇలాంటి పనులు అప్పగించడం వలన విద్యార్థులు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సభ్యులు శర్మ, సుందర్, రామకృష్ణ ప్రసాద్, నాగేంద్రరావు, భానుప్రకాష్, రాంబాబు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రేపు ఐటీడీఏను సందర్శించనున్న జేసీ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏను జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి ఈ నెల 13వ తేదీ బుధవారం సందర్శించనున్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: చత్రపతి శివాజీ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షతన కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో అకౌంటింగ్ అత్యంత ప్రాధాన్యాన్ని సంపాదించుకుందని, జాతీయ ఆదాయం కూడా అకౌంటింగ్ పద్ధతులను ఉపయోగించే లెక్కిస్తారన్నారు. అదేవిధంగా పర్యావరణానికి సంబంధించి గ్రీన్ ఆడిట్‌ని కూడా ప్రవేశపెట్టారని అన్నారు. కేవీవీ శిరీష మాట్లాడుతూ ఇన్‌కమ్ టాక్స్ విభాగంలోనూ జీఎస్టీ విభాగంలోనూ కామర్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.మధు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

కుక్కునూరు: స్థానిక పోలీసులు సోమవారం దాడులు నిర్వహించి అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీఐ ఎం.రమేష్‌బాబు ఆదేశాల మేరకు ఎస్సై ఎస్.రామకృష్ణ పర్యవేక్షణలో సిబ్బంది మండలంలోని వేలేరు గ్రామంలో దాడి చేసి, ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న చంద్రశేఖర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 27 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎత్తిపోతల రైతులతో అధికారుల సమావేశం

చింతలపూడి: చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ డి.ప్రమద్వర రైతులకు హామీ ఇచ్చారు. ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులతో తహసీల్దార్ సోమవారం తన కార్యాలయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు తమ భూములు ఎత్తిపోతల పథకానికి ఇవ్వాలంటే ప్రస్తుత మార్కెట్ ధర ఒక ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఉన్నందున కనీసం రూ.50 లక్షలు తగ్గకుండా నష్టపరిహారం చెల్లించాలని అలా అయితేనే భూములు ఇస్తామని తెలిపారు. అలానే బోర్లు మోటర్లు చెట్లు కోల్పోతున్న వాటికి ప్రస్తుత మార్కెట్ ధర నిర్ణయించి చెల్లించాలని కోరారు. భూమి నష్ట పరిహారం, ఇతర నష్ట పరిహారాలు ఒకేసారి రైతుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్, కార్యదర్శి దొంత కృష్ణ, పిడపర్తి చంద్రశేఖర్ రెడ్డి, పచ్చల శివ, వనమాల రాంబాబు, వనమాల ధర్మ లింగస్వామి, మా ఊరి సత్యనారాయణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.